# భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడొద్దు**

**మ్యాప్ ఆధారంగానే పనులు చేయాలి**

**ఐడీవోసీ పనులను పరిశీలించిన కలెక్టర్ ప్రావీణ్య**



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 14: సమీకృత కలెక్టరేట్ భవన సముదాయ(ఐడీవోసీ) నిర్మాణ పనుల్లో వేగం పెంచి, గడువులోగా పూర్తయ్యేలా చూడాలని ఆర్అండ్బీ అధికారులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఆజంజాహి మిల్స్ స్థలంలో సుమారు రూ. 80 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్అండ్బీ అధికారులతో మాట్లాడి నిర్మాణ పనుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా చూడాలన్నారు. ఎలాంటి మార్పులు చేయకుండా మ్యాప్ ఆధారంగా పనులు చేపట్టాలని సూచించారు. కార్యాలయాల నిర్మాణాలతోపాటు అధికారుల కోసం చేపడుతున్న క్వార్టర్ల నిర్మాణాలను సైతం పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆర్అండ్బీ ఎస్ఈ నాగేందర్రావు, ఈఈ జితేందర్రెడ్డి, డీఈ రాజు, ఏఈ శ్రీకాంత్ ఉన్నారు.

**నిర్మాణ పనులను పూర్తి చేయాలి**

గీసుగొండ: ఈవీఎం గోదాం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కోనాయిమాకుల ఎస్సారెస్పీ కెనాల్ వద్ద రూ. 2 కోట్లతో నిర్మిస్తున్న ఈవీఎం గోదాం పనులను ఆమె పరిశీలించారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నట్లు తెలిపారు. అధికారులు దగ్గరుండి పనులను పూర్తి చేయించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్అండ్బీ ఎస్ఈ నాగేందర్రావు, ఈఈ జితేందర్రెడ్డి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంతోష్కుమార్

## ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన ఉండాలి

పరకాల, డిసెంబర్ 14: ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్కుమార్ సూచించారు. కళాశాల ఆవరణలో గురువారం విద్యార్థులకు ఈ-వేస్టేజీపై అవగాహన కల్పించారు. టెక్నాలజీ, సాంకేతిక పరికాల వినియోగం పెరిగిన ప్రస్తుత రోజుల్లో కాలుష్యాన్ని తగ్గించేందుకు వ్యర్థాల నిర్వహణ చాలా ముఖ్యమన్నారు. సదస్సులో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ప్రాంతీయ అధికారి మామిడి రామకృష్ణ, టాస్క్ మేనేజ్మెంట్ ట్రెయినీ పి.సుప్రియ, టాస్క్ కో ఆర్డినేటర్ రాజశ్రీ, డాక్టర్ అరుణ, సుస్మిత, ఇందిర, సుభాషిణి, ఓదెలు, అనిల్కుమార్, రాజయ్య, అశోక్, రవికుమార్, స్వప్న, సుమలత, రాజు, సంజయ్ పాల్గొన్నారు.

**సీపీని కలిసిన ఎస్సై శ్రీనివాస్**

చెన్నారావుపేట, డిసెంబర్ 14: ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ గురువారం సీపీ అంబర్ కిశోర్ ఝూను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్క అందజేయగా, ఎస్సైకి సీపీ శుభాకాంక్షలు తెలిపారు.



సీపీకి మొక్క అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్



చీరెలు పంపిణీ చేస్తున్న గోపీచంద్

## పేదలకు సేవ చేయడం అభినందనీయం

పోచమ్మమైదాన్, డిసెంబర్ 18: మానసిక, శారీరక ఇబ్బందులతో జీవిస్తున్న వారికి సేవ చేయడం అభినందనీయమని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. పూజ్య గురువు శివానంద 95వ జన్మదిన వేడుకల్లో భాగంగా మల్లికాంబ మనోవికాస కేంద్రంలో గురువారం వృద్ధులకు చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టీ బండారు సాయినారాయణ, శిక్ మునీర్, అశ్విని పాల్గొన్నారు. అలాగే, కొత్తవాడలోని శ్రీమాత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వయం కృషి మహిళా సొసైటీ వయోవృద్ధుల ఆశ్రమంలో బ్లాంకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు ముద్దసాని మల్లిక, ప్రధాన కార్యదర్శి నన్నపు సంజీవరావు, కార్యదర్శులు ఎన్.శ్రీనివాస్, జి.రమేశ్, రాధిక, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**'నియంతృత్వ విధానాలు అవలంబిస్తున్న కేంద్రం'**

పరకాల/నర్సంపేట, డిసెంబర్ 14: గ్రామీణ తపాలా ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ విధానాలు అవలంబిస్తున్నదని, ఇప్పటికైనా ఉద్యోగలను రెగ్యులరైజ్ చేయాలని గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు కోరారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా సంఘం ఆధ్వర్యంలో పరకాల హెడ్ పోస్టాఫీస్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది. అలాగే, నర్సంపేటలో ఏఐడీఎస్యూ యూనియన్ మాజీ అధ్యక్షుడు షాబుద్దీన్ మాట్లాడుతూ తపాలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై కేంద్రం మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేశారు.

**లీడ్ గ్రంథాలయానికి పుస్తకాల అందజేత**

నర్సంపేట, డిసెంబర్ 14: పట్టణంలోని సీనియర్ డాక్టర్ మోహన్రావు లీడ్ గ్రంథాలయానికి గురువారం అమూల్యమైన పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్రావు మాట్లాడుతూ లీడ్ లైబ్రరీ అండ్ లిటరరీ సెంటర్ ఎంతో అద్భుతంగా కొనసాగుతుందని, మరికొంత మంది ముందుకొచ్చి వైద్యశాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు అందించాలని కోరారు.

**వైన్ షాపును తరలించాలని వినతి**

పరకాల, డిసెంబర్ 14: ఆలయానికి దగ్గరలో ఏర్పాటు చేసిన వైన్ షాపును తరలించాలని మహిళలు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. పరకాల 16వ వార్డు పరిధిలోని దుర్గాదేవి ఆలయం దగ్గరలో వైన్షాపు ఏర్పాటు చేయగా, భక్తులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బండారి రజిత, హేమ, వీరలక్ష్మి, కవిత, రవళి పాల్గొన్నారు.

**'ప్రతి ఒక్కరూ హుందాగా జీవించాలి'**

నర్సంపేట, డిసెంబర్ 14: మానవులంతా ఆర్థికంగా, సామాజికంగా హుందాగా, గౌరవప్రదంగా జీవించాలని స్వేచ్ఛా చారిటబుల్ సంస్థ అధ్యకురాలు మైస వసంత అన్నారు. స్వేచ్ఛా చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని బొందబడి పాఠశాలలో 75వ ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. గిరగాని సుదర్శన్గౌడ్, బెజ్జంకి ప్రభాకర్, కోట డేవిడ్, ఉపాధ్యాయులు కూచన శ్రీనివాస్, శ్యామ్కుమార్ పాల్గొన్నారు.

## సర్టిఫికెట్లు అందక విద్యార్థుల ఇక్కట్లు



కార్యాలయం ఎదుట వేచి ఉన్న ప్రజలు

నర్సంపేటరూరల్, డిసెంబర్ 14: తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రకాల సర్టిఫికెట్లు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సర్టిఫికెట్ల కోసం వచ్చారు. కులం, ఆదాయం, నివాసం, ఈడబ్ల్యూఎస్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల కోసం ఇటీవల వందలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. నెలరోజులుగా రెవెన్యూ అధికారులు ఎన్నికల బిజీలో ఉన్నారు. దీంతో దరఖాస్తులు భారీగా పేరుకుపోయాయి. ఎన్నికలు ముగిసి 15 రోజులు కావొస్తున్నా రెవెన్యూ అధికారులు, సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో సకాలంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందడం లేదు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి సకాలంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

## 'గృహలక్ష్మి' ఇండ్లను తనిఖీ చేసిన అధికారులు



కొత్తగట్టులో గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రాంరెడ్డి

ఆత్మకూరు/దామెర, డిసెంబర్ 14: గృహలక్ష్మీ పథకంలో ఎంపికైన మండలంలోని నాలుగు గ్రామాల్లో 13 మంది లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి రాంరెడ్డి గురువారం తనిఖీ చేశారు. కొత్తగట్టు గ్రామంలో 4, తిరుమలగిరిలో 3, కామారంలో 3, చౌళ్లపల్లి గ్రామంలో 3 గృహాలను ఆన్లైన్ చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కలెక్టర్కు నివేదించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్రెడ్డి, ఏపీవో రాజిరెడ్డి, సర్పంచ్లు రంపీస మనోహర్, బొల్ల నరేశ్, కంచె రవికుమార్, కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అలాగే, దామెర మండలంలోని దుర్గంపేట, సీతారాంపురం, ఓగ్లాపూర్, దమ్మన్నపేట, ల్యాదెళ్ల గ్రామాల్లో గృహలక్ష్మీ పథకం ఇండ్లను మండల ప్రత్యేక అధికారి మాధవీలత పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో కాసర్ల రవీందర్, పీఆర్ ఏఈ శ్రీలత, సర్పంచ్లు పురాణం రాజేశ్వరీ ఈశ్వర్, తుత్తురు శ్రీనివాస్, కేతిపల్లి సరోజనారెడ్డి, పుల్యాల రాణి-రఘుపతిరెడ్డి, కే శ్రావణ్య-అనిల్, కార్యదర్శులు ఉన్నారు.

## ఓటరు జాబితాపై పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

పరకాల, డిసెంబర్ 14: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాలో మార్పులు, పోలింగ్ బూత్లపై పలు పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో శ్రీనివాస్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్లలో నెలకొన్న సమస్యలపై వారితో చర్చించి సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ ప్రతినిధులు సూచించిన సలహాలు, సూచనలు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, పోలింగ్ స్టేషన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఆర్డీవో అన్నారు. కార్యక్రమంలో పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, సంగెం మండలాల తహసీల్దార్లు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి పాల్గొన్నారు.

## 'మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి'

గీసుగొండ, డిసెంబర్ 14: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం లీగల్ కౌన్సిలర్ శోభారాణి అన్నారు. మచ్చాపురంలో గురువారం వీవో సంఘాల సభ్యులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలు, బాలికలు హింసకు గురవుతున్నట్లు తెలిపారు. మహిళలపై అధికంగా వరకట్న, లైగింక వేధింపులు జరుగుతున్నాయని, వాటి నుంచి బయటపడేందుకు మహిళలు చట్టాలు తెలుసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వీవో సభ్యురాలు సుధ, మహిళలు పాల్గొన్నారు.

**జిల్లాస్థాయిలో యువతకు సాహిత్య పోటీలు**

కాశీబుగ్గ, డిసెంబర్ 14: జిల్లాలోని గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని 15 నుంచి 29 ఏళ్లలోపు వారిలో కళానైపుణ్యాలు, సాహిత్యాన్ని వెలికితీసి ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వంచనున్నట్లు డీవైఎస్డీవో సత్యవాణి తెలిపారు. మన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు ఎనిమిది అంశాల్లో యువతకు పోటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వివరాలకు 9948185608, 7702155096, 8106060686 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

**11 మందికి గ్రహణ మొర్రి వైద్య పరీక్షలు**



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

గిర్మాజీపేట, డిసెంబర్ 14: గ్రహణ మొర్రి వైద్య శిబిరాన్ని గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష జిల్లా శాఖ, బసవతారకం స్మైల్ సెంటర్ డాక్టర్ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో 11 మంది బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరుగురు విద్యార్థులను తదుపరి శస్త్ర చికిత్స కోసం సిఫారసు చేశారు. కార్యక్రమంలో డీఈవో డీ వాసంతి, అన్నారు. జిల్లా ఐఈ సీఎంవో కుడికాల సుభాష్, స్మైల్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జోషి, కార్తీక పాల్గొన్నారు.

**పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి**

ఆత్మకూరు, డిసెంబర్ 14: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సర్పంచ్ రాజు కోరారు. మండలకేంద్రంలోని జీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మా సోషల్ ఆక్టివిటీస్ సంస్థ ఆధ్వర్యంలో 'పర్యావరణ పరిరక్షణ-ప్లాస్టిక్ నివారణ' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐక్యంగా, స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించినప్పుడే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పాపని రవీందర్, బయ్య రాజు, రేవూరి ప్రవీణ్రెడ్డి, కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.

**మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి**



మాట్లాడుతున్న ఖాజా మోయినొద్దీన్

దామెర, డిసెంబర్ 14: మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని జన శిక్షణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఖాజా మోయినొద్దీన్ అన్నారు. సింగరాజపల్లిలో జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. మహిళలు కుటీర పరిశ్రమలు స్థాపించుకొని ఉపాధి పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రాణి, సఖీ వన్స్టాప్ కేంద్రం వర్కర్ వినీల, సరిత, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తిరుపతి, రాజు, సుజిత్, స్వరూప, రమ, వాణి పాల్గొన్నారు.